# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మూడు గంటలిస్తే మునుగుడే..

- మూల కూడా పారదు
- రాత్రంతా పొలాల కాడ పడిగాపులే..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



కరీంనగర్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఎలా సరి పోతుందని, పొలం మడిలో మూల కూడా పారదని జిల్లా రైతులు మండి పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోసం అనేక కష్టాలు పడ్డా మని, తప్పిపోయి కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే చీకటి రోజులు పునరావృతం అవుతాయనే చర్చ జరుగుతోంది. అధికారంలోకి రాక ముందే కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అని చేస్తున్న ప్రచారాన్ని రైతులు తీవ్రంగా ఖండిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్వయంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. గతంలో మాదిరి రాత్రి కరెంట్ ఇవ్వడం వల్ల పొలాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వస్తుందని, గతంలో తమ అనుభవాలను ఏకరువు పెడుతున్నారు. దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి ఎందరో రైతుల ఉసురు పోసుకున్న కాంగ్రెస్‌ను అధికారం లోకి రాకుండా చేయాలని స్పష్టం చేస్తున్నారు. బీజేపీ కూడా తెలంగాణ రైతులకు అన్యాయం చేసిందని రైతులు ఆక్షేపిస్తున్నారు. కేసీఆర్ లేకుంటే తమ మోటర్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసేవారని, గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మోటర్లకు మీటర్లు పెట్టనివ్వని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### కేసీఆర్ అంటేనే పవర్ ఫుల్



కేసీఆర్ సారు తెలంగాణ తీసుక వచ్చి అప్పటి నుంచి కరెంటును పవర్‌ఫుల్‌గా 24 గంటలు ఇయ్య వట్టె. కరెంటు కష్టాలను మరచి తొమ్మిదేండ్లు దగ్గరికి వచ్చింది. అవసరం ఉన్నప్పుడు పొలంకాడికి పోయి మోటరుపెట్టి ఎవుసం చేసుకుంటున్నం. కాంగ్రెసోళ్లు మేము అధికారంలోకి వచ్చినక మూడు గంటలు ఇత్తమని చెప్పడంతో భయం అయితుంది. గింత మంచిగా కరెంటు ఇత్తున్న సారును బతికున్నంత కాలం రైతులు మరవద్దు. కాంగ్రెసోళ్లను దగ్గరికి రానియ్యద్దు.

**- మూడ్ డోలియా, ముచ్చర్ల(గంభీరావుపేట)**



### ఆనాడు కోతలు తప్ప కరెంటు ఎక్కడిది..

కాంగ్రెసొళ్లు ఏలినపుడు కోతలు తప్ప కరెంటు ఎక్కడిది. కరెంటు ఎప్పుడస్తాదో అని లైటువేసి సూసుడుకే సరిపోయ్యేది. అప్పట్లనే ఆరు గంటల కరెంటు అని మూడు గంటలు కూడా ఇచ్చేటోళ్లుకాదు. మల్లా కరెంటు ఎప్పుడూ పోతదేమోనని భయపడేటోళ్లం. కరెంటు ఉన్నప్పుడే పొలానికి నీళ్లు పెట్టాలని ఉరుకేటోళ్లం. అందరం ఒకటేసారి మోటర్లు ఏసేటోళ్లం. అట్టా ఏసినమో లేదో ఇట్లా ట్రిప్‌అయ్యేది. మల్లా కరెంట్ అచ్చేదాకా గోసే. ఇన్ని కష్టాలాల్ల ఎవుసం జేస్తే సగం పంట కూడా చేతికచ్చేదికాదు. కానీ ఇప్పుడు ఏ రందీ లేదు. ఎప్పుడు తడి పెట్టాలంటే అప్పుడే మోటరేస్తున్నం. ఇప్పుడు పొద్దుందాకా నీళ్లు పెట్టి పొద్దుగాక ఇంటికి వస్తున్నం. కేసీఆర్ సార్ అచ్చినంక రాత్రిపూట పొలానికి వచ్చే అక్కరే లేకుండాపోయింది.

**- భూక్యా బావుసింగ్, లాల్‌సింగ్‌తండా (వీర్నపల్లి)**

### దొయ్యి కూడా తడవదు..

మూడు గంటల కరెంట్‌తో పొలంలోని ఒక దొయ్యి కూడ తడవదు. 3 గంటల కరెంట్ అంటే అది అందరికీ ఒకే సారి ఇస్తరు, దీంతో రైతులంతా పొలాలకు నీళ్లు పెట్టేందుకు ఒకే సారి మోటార్ చాల్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలి పోతయ్, మోటార్లు కాలి పోతయ్. కరెంట్ సబ్ స్టేషన్ల మీద కూడా అధిక లోడ్ పడి ఇండ్లలోకి వచ్చే కరెంట్ కూడా ముంపు ఉట్టది. 24 గంటల కరెంట్‌తో మా గోసలు తీరినయ్. భార్య, పిల్లలతో సుఖంగా ఇంటికాడ పడుకుంటున్నాం. కాంగ్రెస్సోళ్లు మాట్లాడే మాటలన్ని అబద్ధాలు. ఎనకట కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు రైతులంతా ఎంత తిప్పలు పడ్డమో గుర్తుంచుకోవాలి. కరెంట్ కోసం ఎనకట బాయిల కాడి కోసం కండ్లల్ల వత్తులేసుకొని కరెంట్ కోసం కావాలి కాసేటోళ్లం. కరెంట్ నాణ్యంగా ఇచ్చేటోళ్ల కాళ్లల్ల కట్టెలు పెట్టడం మంచి పద్ధతి కాదు. రైతు గురించి తెలిసినోడు కాబట్టే కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్‌ను అందిస్తున్నాడు.

**- గుంజె రాజేశ్, రైతు (రుద్రంగి)**

### ధరణి తీసేస్తే రైతులు ఆగమే



ధరణి పోర్టల్ తీసేస్తే రైతులు ఆగమవుడే. గతంలో రెవెన్యూ సిబ్బంది రికార్డులను ఇష్టారాజ్యంగా రాసేటోళ్లు. ఒకల భూమి ఇంకొకలకు రిజిస్ట్రేషను చేసేటోళ్లు. పాలోళ్లు రెవెన్యూ అధికారులకు లంచాలు ఇచ్చి భూములు పట్టాలు చేయించుకునేటోళ్లు. దీంతో గొడవలు జరిగి పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరుగుతుండే. ఇట్లా అనేక సమస్యలు వచ్చేవి. ధరణి వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులందరూ ఉంటేనే అన్నదమ్ముల భూములు సమానంగా పంపిణీ జరుగుతుంది. రిజిస్ట్రేషన్ కూడా రైతు వేలి ముద్ర ఉంటేనే ఇంకొకరి పేరు మీదకు ఎక్కుతుంది. లంచాలు లేవు, ఏ ఇబ్బంది లేదు. ధరణినే ఉండాలి.

**- పుల్లూరి రాజిరెడ్డి, రైతు, మర్రిగడ్డ(చందుర్తి)**

### ధరణి వద్దన్న కాంగ్రెస్‌ను నమ్మేది లేదు



కాంగ్రెస్ ధరణి తీసేస్తమని చెబుతుంది. దీంతో రైతులు మళ్లీ గోసలు పడాల్సి వస్తుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చాలా కష్టాలు చూసినం. అన్నింటికీ ఇబ్బందులే. ఎవుసం చేసుడంటే ఏడుపు వచ్చేది. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ తీసుకొచ్చి ఎవరి భూములు వారికి ఉండేట్లు చూసిండు. రెవెన్యూ కార్యాలయాల చుట్టు ఏళ్ల తరబడి తిరగకుండా ధరణి మంచిగ పని చేస్తుంది. రైతు అంగీకారం లేకుండా ధరణిలో అధికారులు ఏ మార్పు చేసేది లేకుండా ఉంది. ధరణి వచ్చనంకనే భూముల సమస్యలు పోయి రైతులు మంచిగ ఎవుసం చేసుకుంటున్నరు. ధరణియే ఉండాలని రైతులం కోరుకుంటున్నం. కాంగ్రెస్‌ను నమ్మేది లేదు. అయినా ఆ కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటు వేస్తం. మళ్ల కేసీఆర్ సారే రావాలి.

**- బొంబోతుల గంగయ్య, రైతు, మర్రిగడ్డ(చందుర్తి)**



### ధరణి తీసేస్తే రైతులకు అధోగతే..

కాంగ్రెస్ ధరణి తీసేస్తామని చెబుతుంది. మళ్లీ పాత వ్యవస్థతో అరిగోస తప్పదు. లంచం లేనిదే ఒక్క పనీ కాదు. లేదంటే నెలల కొద్దీ ఆఫీసుల చుట్టూ తిరగాలి. పైసలిస్తే రైతుల భూములు ఒకరి పేరు మీద నుంచి ఇంకొకరి పేరు మీదికి ఎక్కించోటోల్లు. కొత్త పేర్లు పుట్టకొస్తాయి. పట్టా పాస్‌బుక్‌లో అనుభవదారు కాలం వస్తే గొడవలు మొదలవుతయి. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుది. రిజిస్ట్రేషన్ కూడా సరిగా ఉండది. పట్టణాలకు వెళ్లి డబ్బుల ఖర్చుల చేసుకోవడంతో పాటు సాక్షులకు కైకిలీ ఇచ్చి తీసుకపోయేటోల్లం. ధరణి పోతే రైతుల ఆత్మహత్యలే జరుగుతాయి. కాంగ్సెసోళ్లను నమ్మితే మోసపోతం.

**-జంకె శ్రీనివాసరెడ్డి, రైతు(బోయినపల్లి)**

### మూడు గంటల కరెంట్‌తో మళ్లీ పాత కథనే..



గతంల ఆరేడు గంటల కరెంట్ ఇత్తేనే రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఊర్కే బోర్లు, మోటార్లు కాలిపోవుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేది. రిపేర్ల కోసం అష్టకష్టాలు పడేది. ఇంక 3 గంటల కరెంట్ మాత్రమే రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటది. రైతులకు సరిపడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వక పోతే ఇటు పంట దిగుబడి రాదు.. అటు పంట మంచిగా పండదు. దీంతో రైతు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి కూడా ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితులుంటాయి. ప్రతీ రైతుకు సరిపడా విద్యుత్ ఉంటేనే ఏవుసాన్ని ఓ పండుగలా చేసుకునేందుకు వీలుంటుంది. 3 గంటల కరెంట్ మాత్రమే సరిపోతది అంటే అన్నోళ్లకు ఏవుసం అంటేనే తెలువదని నేను అనుకుంటున్న.

**- రాపెల్లి కొండయ్య, కొలనూరు (కలెక్టరేట్)**

### కరెంటు లేకపోతే బీడు భూములవుతయ్



కరెంటు 24గంటలు లేకపోతే మళ్ల బీడు భూములే దర్శనమిస్తయ్. రైతు గురించి అవగాహన ఉండి మాట్లాడితే తెలిసినోల్లు అనుకోవచ్చు. కానీ కాంగ్రెసోళ్లు అవగాహన లేకుండా 10హెచ్‌పీ మోటరు పెడితే మూడు గంటల కరెంటుకు, గంటకు మూడెకురాలు పారుతుందని ఎడ్డిమాటలు మాట్లాడడం సరికాదు. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో సాగు పెరిగింది. కుప్పులు తెప్పలుగా వరిధాన్యం రాశులు పోస్తున్నం. ఇట్ల పుట్ల కొద్దీ వడ్లు రావడంతో పంటను అమ్ముకుని సంతోషంగా జీవిస్తున్నం. రైతుల కష్టాలు తెలిసిన కేసీఆరే మల్ల సీఎం అయితే రాష్ట్ర అగం కాకుండా రైతు రాజ్యం నడుస్తది.

**- ఊరడి వైకుంఠం, రైతు, ధర్మారం(కోనరావుపేట)**

### దళారులొద్దు.. ధరణే కావాలి



పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమని కాంగ్రెస్ చెబుతుంది. పట్వారీలు ఉన్నప్పుడూ ఊరికి కొందరు దళారులు ఉండి లంచాలు తీసుకుని పనులు చేపిచ్చేటోళ్లు. రికార్డులు సరిగా లేవని సరి చేయాలని పైసలు పెట్టించేవాళ్లు. రికార్డులు అన్నీ తప్పులుగా ఉండేటివి. ధరణి వచ్చింది. రైతుల సమస్యలను తీర్చింది. ఏ భూమి ఎక్కడా ఉంది. ఎవరికీ పట్టా ఉందని తెలుస్తుంది. ఆ రికార్డులు మార్చడం ఎవరీ తరం కాదు. రైతు వేలిముద్ర లేనిదే ఏ పని చేయడానికి వీలు ఉండదు. కాబట్టి ఏం జరిగిన రైతుకు తెలిసే జరుగుతది. పట్వారీ వ్యవస్థను తీవ్రంగా ఖండిస్తున్న. ధరణి పోర్టలే ఉండాలి. అయినా కాంగ్రెసోళ్లు అప్పుడే కలలు కంటున్రు. వాళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. రైతుల మంతా కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్రు. ఎట్లయిన గెలిపించుకుంటం.

**- మరిపెల్లి రాజేశం, రైతు (రుద్రంగి)**